



సమీక్షకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు


జిల్లాను అభివృద్ధి బాట పట్టిద్దాం..

- పరిశ్రమల ఏర్పాటుకు పుష్కల అవకాశాలు
- సమష్టిగా పనిచేద్దాం
- అధికారులు మారాలి.. పనిచేయాలి..
- భూముల ఫ్రీహోల్డ్‌లో భారీగా అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తప్పవ్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్

7

చిన్నబోతున్న చిట్టి తల్లి..!

- నేటికీ కొనసాగుతున్న బాల్యవివాహాలు



కడుపున పుట్టిన బిడ్డ అంటే..
తల్లిదండ్రులకు పంచప్రాణాలు..
బుజ్జితల్లీ అంటూ జోలపాడతారు..
ఆడిస్తారు.. పాడిస్తారు..
ముద్దులొలికే మాటలు వింటూ
మురిసిపోతారు..
ప్రాణంగా చూసుకుంటారు..
ఆ పాపే.. బాధ్యతవుతోందా?
చిరుప్రాయంలోనే పెళ్లిచేసేస్తే..
అది తీరిపోతుందా?
ఆకాశమంత ప్రేమ పంచిన
అమ్మానాన్న..
ఇలా ఎందుకు చేస్తున్నారోనని
చిన్నబోతోంది చిట్టితల్లి..

2024లో ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాలు

నెల	అడ్డుకున్న బాల్య వివాహాలు
జనవరి	8
ఫిబ్రవరి	14
మార్చి	11
ఏప్రిల్	16
మే	8
జూన్	7
జూలై	5
ఆగస్టు	9
సెప్టెంబరు	12
అక్టోబరు	8
మొత్తం	98

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

బాల్యవివాహాలు పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా చేస్తున్నారు. పట్టణాల్లో వివాహాలు ఆలస్యంగా జరుగుతుంటే గ్రామాల్లో మాత్రం బాలికలకు పెళ్లీడు రాకనే చేసేస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ చదువుతున్న బాలికలకు వివాహాలు చేస్తుండటంతో వారి చదువు మధ్యలోనే ఆగిపోతోంది. తెలిసీతెలియని వయసులో వారిపై బాధ్యతలు పడుతుండడంతో బాల్యం బలౌతోంది.

ఆర్థిక ఇబ్బందులతో..



కుమార్తె పుట్టినప్పట్నుంచీ బాధ్యతగా తల్లిదండ్రులు భావిస్తారు. పదేళ్లు దాటగానే ఆడపిల్లకు పెళ్లి చేయాలని ఆరాట పడుతుంటారు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులు ఒక కారణంగా తెలుస్తోంది. బిడ్డకు పెళ్లి చేస్తే బాధ్యత తీరిపోతుందని పలువురు తల్లిదండ్రులు భావిస్తుండడం కూడా బాల్యవివాహాలకు కారణమవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారే ఎక్కువగా బాల్యవివాహాలు చేస్తున్నట్లు మాతాశిశుసంరక్షణ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తున్నా..

బాల్యవివాహాల దుష్పరిణామాలపై ప్రభుత్వం, అధికారులు పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా.. బాల్యవివాహాలు చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. సమాచారం తెలుసుకుని, తల్లిదండ్రులకు మాతాశిశు సంరక్షణ అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆ సమయంలో పెళ్లి చేయమని తల్లిదండ్రులు అంగీకరించి, వెళ్లిపోతున్నారు. తరువాత గుట్టుగా పెళ్లి చేసేస్తున్నట్లు తెలుస్తోంది.

రెండేళ్ల జైలు..



బాల్య వివాహం చేస్తే అమ్మాయి, అబ్బాయి తండ్రికి రూ.లక్ష జరిమానాతోపాటు రెండేళ్ల జైలు శిక్ష పడుతుంది. అబ్బాయి మేజర్ అయితే అతడికి కూడా రూ.లక్ష జరిమానాతోపాటు రెండేళ్ల జైలు శిక్ష ఉంటుంది.మైనర్ అయితే పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తారు.

- ఆర్థిక సమస్యలు, బాధ్యతగా భావించడమే కారణం
- ఛిద్రమవుతున్న బాల్యం
- అంధకారమవుతున్న బాలికల భవిష్యత్తు

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలోనూ బాల్యవివాహాలు కొనసాగుతున్నాయి. పెళ్లీడు రాకనే బాలికలకు వివాహం చేస్తున్నారు. దీంతో వారి బాల్యం ఛిద్రమవుతోంది. భవిష్యత్తుపై వారు పెట్టుకున్న ఆశలు, కన్న కలలు చెదిరిపోతున్నాయి. బాల్యవివాహాల నియంత్రణకు ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నా.. ఎక్కడో ఓచోట కొనసాగుతూనే ఉన్నాయి. బాధ్యత తీరిపోతుందన్న ఆలోచనతో తల్లిదండ్రులు.. కుమార్తెను చిరుప్రాయంలోనే పెళ్లికూతురిని చేస్తున్నారు. ఏటా 12 శాతంపైనే బాల్యవివాహాలు చేస్తున్నట్లు అంచనా. ఇది కలవరపెట్టే అంశమే.

అవగాహన కల్పిస్తున్నాం

బాల్యవివాహాలపై పురోహితులు, ఖాజీలు, చర్చి ఫాదర్లు, 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నాం. బాల్యవివాహాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. బాల్యవివాహాలకు సంబంధించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం అందించాలి. గతంతో పోలిస్తే ప్రస్తుతం కొంత తగ్గుముఖం పట్టాయి.

-నాగమల్లీశ్వరి, ఐసీడీఎస్ పీడీ

అపార్ అవస్థలు

- ముందుకుసాగని విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ
- సరిపోలని వివరాలు
- తలలు పట్టుకుంటున్న టీచర్లు



అపార్ కార్డు నమూనా

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ టీచర్లకు తలనొప్పిగా మారింది. పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్, ఆధార్, యూడైస్‌లో విద్యార్థులకు సంబంధించి ఒకే సమాచారం ఉండాలన్న నిబంధన కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ముందుగా 9, 10 తరగతుల వారికి మాత్రమే అపార్ ఐడీ అన్న ప్రభుత్వం.. తాజాగా 1 నుంచి 10వ తరగతి వరకు అందరికీ అమలు చేస్తోంది. దీంతో టీచర్లకు సమస్య మొదలైంది. విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒకలా.. ఆధార్‌లో మరోలా ఉన్నాయి. పుట్టిన తేదీ వివరాలు సచివాలయంలో ఇంకోలా ఉన్నాయి. కొందరు విద్యార్థుల ఇంటి పేరు కూడా ఆధార్‌లో పూర్తిగా లేదు. ఈ సమాచారం సరిపోలక అపార్ రిజిస్ట్రేషన్ కోసం టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్‌లో విద్యార్థుల వివరాల్లో అక్షరం తేడా వచ్చినా అవి ఆమోదించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

అపార్ అంటే..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం 2020 అమలులో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అవసరమని తేల్చిచెప్పింది. ఇప్పటికే విద్యార్థులకు పెన్ నంబర్లను కేటాయించగా కొత్తగా అపార్‌ను ప్రవేశపెట్టింది. ఈ నంబరు సృష్టించేందుకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. అపార్ పేరుతో ఆన్‌లైన్‌లో ప్రతి విద్యార్థికి ఒక నంబరు కేటాయిస్తారు. అందులోనే ఆ విద్యార్థికి సంబంధించి విద్యా విషయాలు, నైపుణ్యాలు పొందుపరుస్తారు. ఈ నంబరు కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మూడు రకాల రికార్డుల్లో విద్యార్థుల వివరాలు ఒకేలా ఉండాలి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మొత్తం జిల్లావ్యాప్తంగా 2,41, 641 మంది విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు 1,08,957 మంది విద్యార్థులు అపార్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

మూడు రకాల వివరాలు..

ప్రస్తుతం పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారిలో కొందరి వివరాలు గందరగోళంగా ఉన్నాయి. ఒక విద్యార్థికి మూడు రకాల పుట్టిన తేదీలు ఉండటం సమస్యగా మారింది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి 1వ తరగతిలో చేరేటపుడు తల్లిదండ్రులు చెప్పిన విధంగా ప్రధానోపాధ్యాయులు పుట్టిన తేదీ ఇతర వివరాలను అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వాటినే హైస్కూల్‌లో 6వ తరగతిలో చేరినపుడు అక్కడి అడ్మిషన్ రిజిస్టర్‌లోనూ కొనసాగిస్తారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో పిల్లల జనన రిజిస్టర్‌లో మరో పుట్టిన తేదీతో వారి వివరాలు నమోదవుతున్నాయి. ఆధార్ నంబరులో విద్యార్థుల పుట్టిన తేదీ లేకుండా కేవలం సంవత్సరం మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో పుట్టిన తేదీల్లో దేనిని ప్రామాణికంగా తీసుకోవాలో అర్థంకాక టీచర్లు గందరగోళం చెందుతున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 9వ తరగతి వరకు పుట్టినతేదీ మార్చే అధికారం డీఈఓలకు ఉంది. పదో తరగతి వారికి ఆర్జేడీ చేయాలి. ఆ వివరాలు మార్పుల కోసం అటు కార్యాలయాలు, అటు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాల చుట్టూ తల్లిదండ్రులు, టీచర్లు ప్రదక్షిణ చేస్తున్నారు.



ఆధార్ కేంద్రం వద్ద గుమిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించండి

- కలెక్టర్ చేతన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 193 వినతులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ... ఒకే సమస్యపై పలుమార్లు వినతులు రాకుండా సరైన పరిష్కారం చూపాలంటూ ఆదేశించారు. ముదిగుబ్బ మండలం సంకేపల్లి సర్వే నంబరు 255లో దళితుల శ్మశానం ఉందనీ, ఇందుకు వేరొకరి పేరుతో పట్టాదారు పుస్తకం ఇచ్చారనీ, దానిని రద్దు చేయాలని ఆ గ్రామ దళితులు ఫిర్యాదు చేశారు. జిల్లావ్యాప్తంగా 450 యానిమేటర్లను తొలగించారనీ, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బాధితులు కోరారు. తన భూమి రోడ్డుకు పోయిందని అయితే డబ్బు మరొకరికి వేశారంటూ బుక్కపట్నం మండలం అగ్రహారానికి చెందిన రైతు భాస్కర్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

కత్తి కలకలం

కలెక్టరేట్‌లో కత్తి కలకలం రేపింది. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు కత్తి బ్యాగులో పెట్టుకుని మహిళ వస్తుండగా పోలీసులు గుర్తించారు. తనకల్లు మండలం బంతలపల్లికి చెందిన ప్రేమలత బ్యాగులో కత్తిపెట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. ప్రధాన గేటు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా బ్యాగులో కత్తి దొరికింది. ఆత్మరక్షణకే కత్తిని తెచ్చుకున్నట్లు ప్రేమలత తెలిపింది. పోలీసులు.. కత్తిని స్వాధీనం చేసుకుని, ఆమెను లోపలికి వదిలారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 36 అర్జీలు అందాయి. ఎస్పీ రత్న.. వాటిని స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులను పరిశీలించి, చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలిటికల్ టూర్..!

- పురం మున్సిపాలిటీలో వేడెక్కిన రాజకీయం
- చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ ఎత్తులు
- విహారయాత్రకు 22 మంది కౌన్సిలర్లు



హిందూపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పొలిటికల్ టూర్‌కు తెరలేపారు. మున్సిపల్ చైర్మన్ పీఠంపై కన్నేసిన టీడీపీ.. కౌన్సిలర్లను సోమవారం విహార యాత్రకు తరలించింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ స్థానం టీడీపీ కైవశం కానుందన్న చర్చ జోరందుకుంది. నిన్నటివరకు ఇరు పార్టీలను ఊరించిన చైర్మన్ పీఠం ఎట్టకేలకు టీడీపీకే దక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో 22 మంది తెలుగుదేశం పార్టీ ప్రతిపాదించే అభ్యర్థికి ఓటు వేస్తామని విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. వారు ఇక నేరుగా చైర్మన్ ఎన్నిక రోజునే మున్సిపల్ కార్యాలయానికి రానున్నారు. అప్పటివరకు వా రు విహార యాత్రలోనే ఉండనున్నట్లు సమాచారం.

2021 మున్సిపల్ ఎన్నికల్లో 38 మంది కౌన్సిలర్లకుగాను 30 మంది వైసీపీ, ఆరుగురు టీడీపీ, బీజేపీ, ఎంఐఎం తరఫున ఒక్కొక్కరు గెలుపొందారు. అప్పట్లో 19వ వార్డు నుంచి గెలుపొందిన ఇంద్రజను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు వైసీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఇక్బాల్‌ను తప్పించి, దీపికకు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్, ఇన్‌చార్జి వర్గాల మధ్య దూరం పెరిగింది. ఇంద్రజ.. ఇక్బాల్ వర్గంలో ఉండటంతో ఆమెకు దీపిక వర్గం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు ఎంఐఎం కౌన్సిలర్‌తోపాటు మరో ముగ్గురు టీడీపీలో చేరారు. దీంతో ఎన్నికలకు ముందే టీడీపీ బలం పదికి చేరింది. ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తెలుగుదేశం పార్టీ తరఫున గెలుపొందిన 6వ వార్డు కౌన్సిలర్ రమేష్ చైర్మన్ స్థానంపై ఆశలు పెంచుకున్నారు. అందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం ఇంద్రజ చైర్‌పర్సన్ పదవి, వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆమెతోపాటు ఎనిమిది మంది కౌన్సిలర్లు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో తెలుగుదేశం బలం 19కి చేరింది. ఈ తరుణంలో ఇక తెలుగుదేశం పార్టీకి చైర్మన్ స్థానం కైవసమైనట్లేనని భావించారు.

మళ్లీ వైసీపీలోకి..

చైర్‌పర్సన్‌తోపాటు చేరిన నలుగురు కౌన్సిలర్లు నెల క్రితం తిరిగి వైసీపీలో చేరారు. దీంతో మరోసారి వైసీపీ నాయకుల్లో చైర్మన్ స్థానంపై ఆశలు చిగురించాయి. మూడోవార్డు నుంచి గెలుపొందిన మహిళా కౌన్సిలర్.. చైర్మన్ స్థానం కోసం పోటీపడ్డారు. వైసీపీకి చెందిన కౌన్సిలర్లను జగన్ వద్దకు తీసుకెళ్లారు. ఖర్చు భరించుకుని, చైర్మన్ అయితే అభ్యంతరం లేదని పార్టీ అధినేత చెప్పినట్లు సమాచారం. దీంతో అక్కడి నుంచి హిందూపురానికి చేరుకున్న కౌన్సిలర్లు అప్పటి నుంచి రెండు, మూడుసార్లు క్యాంపు రాజకీయాలు సాగించారు. ఈ నేపథ్యంలోనే చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న వ్యక్తి ఇప్పటి వరకు అరకోటిదాకా ఖర్చు చేసినట్లు తెలిసింది. వైసీపీ తరఫున గెలుపొందిన కౌన్సిలర్లు ఈ పార్టీలో ఉండి ఇప్పటివరకు నష్టపోయింది చాలు.. మరో ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉంటూ ఎందుకు దిష్టిబొమ్మలా ఉండాలని భావించారు. దీంతో వైసీపీకి చెందిన కౌన్సిలర్లు కొంతమంది తెలుగుదేశం వైపు వచ్చేశారు.

ఎత్తుకు పైఎత్తు వేసిన టీడీపీ

ఎలాగైనా చైర్మన్ స్థానాన్ని దక్కించుకోవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు ఎత్తుకు పైఎత్తులేస్తూ వైసీపీ నాయకుల ప్లాన్‌ను పసిగడుతూ ఆ పార్టీ కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లను దీపిక, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ రెండు, మూడుసార్లు వెంటబెట్టుకుని క్యాంపు రాజకీయాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

విహారయాత్రకు 22 మంది..

మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడనుందన్న సమాచారంతో సోమవారం తెలుగుదేశం పార్టీ తరఫున బరిలో ఉన్న చైర్మన్‌కు ఓటేస్తామని ముందుకొచ్చిన వైసీపీ కౌన్సిలర్లను కలుపుకుని 22 మందిని ప్రత్యేక బస్సులో హిందూపురం నుంచి తీసుకెళ్లారు. వీరంతా హైదరాబాద్ విహార యాత్రకు వెళ్లారు. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్తారన్నది తెలియాల్సి ఉంది. వీరంతా శుక్రవారం హిందూపురానికి రానున్నట్లు సమాచారం. చైర్మన్ ఎన్నికకు సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ వెలువడనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఒకవేళ మంగళవారం నోటిఫికేషన్ వస్తే గురు, శుక్రవారాల్లో చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. నిన్నటివరకు దోబూచులాడిన చైర్మన్ స్థానం తెలుగుదేశం వశం కానుందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

పరిశీలకుడి ఆధ్వర్యంలో తరలింపు

మున్సిపల్ ఎన్నిక సజావుగా నిర్వహించేందుకు తెలుగుదేశం పార్టీ తరఫున రాష్ట్ర కార్యదర్శి అయిన కర్నూలుకు చెందిన నాగేశ్వర యాదవ్‌ను నియమించారు. ఆయన ఆదివారమే హిందూపురం చేరుకుని, కౌన్సిలర్లతో సమావేశమై విహార యాత్రకు తీసుకెళ్లారు. వీరి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ జేవీ అనిల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు నాగరాజు వెళ్లారు.

సమష్టిగా ముందుకెళ్దాం..

- ఎన్డీఏ విజయం కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిద్దాం
- జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుదాం
- జిల్లా, నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని
- మాకూ ప్రాధాన్యమివ్వాలి: జనసేన, బీజేపీ నాయకులు
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో సమస్యల ప్రస్తావన

పుట్టపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిగా వెళ్లి ఎన్నికల్లో ఎలా క్లీన్‌స్వీప్ చేశామో, భవిష్యత్తులో కూడా సమష్టిగా పనిచేసి, జిల్లాను అన్నిరంగాల్లో అగ్రపథంలో తీసుకెళ్దామని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో సోమవారం నిర్వహించిన ఎన్డీఏ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి ఇన్‌చార్జి మంత్రితోపాటు జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, ఎంపీ బీకే పార్థసారథి, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు టీసీ వరుణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో కూటమి పార్టీల్లో సమన్వయ లోపాలతోపాటు సమస్యలపై చర్చించామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కూటమి పార్టీలు కలిసి పని చేస్తున్నా.. కొన్ని ఇబ్బందులున్నాయనీ, వాటిని సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. కూటమి విజయానికి కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఆ



ఎన్డీఏ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు

దిశగా అనువైన అంశాలపై కార్యాచరణ రూపొందించి, ముందుకెళ్తామన్నారు. రెవెన్యూ పరంగా జిల్లాలో గత వైసీపీ పాలనలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారన్నారు. జిల్లాలో 2.29 ఎకరాలకుపైగా అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశారని మంత్రి ఆరోపించారు. ఇందులో 1.15 లక్షల ఎకరాల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయిందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో స్పెషల్ డ్రైవ్ పెట్టి, విచారణ చేపడతామన్నారు. సీసీఎల్ఏ నుంచి అదనపు కార్యదర్శి స్థాయి అధికారిని నియమించి, జిల్లాలో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపుతామని మంత్రి వెల్లడించారు. ఎన్డీఏ జిల్లా, నియోజక వర్గ స్థాయి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

విజయానికి కష్టపడిన వారిని మరవద్దు

అరాచక వైసీపీ పాలనపై పోరాటం చేసి, కూటమిని అధికారంలోకి తేవడానికి కష్టపడి పనిచేసిన వారిని మరవద్దని ఎంపీ బీకే పార్థసారథితోపాటు జనసేన, బీజేపీ నేతలు ప్రస్తావించారు. అధికారంలోకి ఇచ్చి ఐదు నెలలు గడిచినా పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలను గుర్తించడంలేదన్నారు. అన్ని నియోజకవర్గాల్లో చాలామంది నేతలు, కార్యకర్తలు గెలిచాక తమను పట్టించుకోవడంలేదని ఆవేదనతో ఉన్నట్లు గుర్తుచేశారు. ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు.. కూటమి పార్టీల నేతలు, శ్రేణులను కలుపుకొని వెళ్లాలని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుతగుతులున్నారని జనసేన, బీజేపీ నేతలు.. మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో చాలాచోట్ల అధికార యంత్రాంగం వైసీపీ ప్రభుత్వం ఉందన్న భ్రమలో ఆ పార్టీ నేతల పనులు చక్కబెడుతున్నారనీ, వారిపై చర్యలు తీసుకుంటే తప్ప.. అధికార యంత్రాంగంలో పట్టురాదనీ, ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

వైసీపీతో అంటకాగిన వారికి పోస్టింగులా..?

గత వైసీపీ హయాంలో అప్పటి నాయకులతో అంటకాగుతూ కూటమి శ్రేణులపై అక్రమ కేసులు, అరెస్టులతో ఇబ్బంది పెట్టి రెడ్‌మార్క్ వేయించుకున్న సీఐ, ఎస్ఐలకు మంచి పోస్టింగులు ఎలా ఇచ్చారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత.. మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇదే విషయంపై పోలీసు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే పైనుంచి ఆదేశాలు వచ్చాయని అంటున్నారని ప్రస్తావించారు. వైసీపీ పాలనలో వీఆర్‌లో ఉన్న వారికి పోస్టింగ్ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి, పనిచేసే అధికారులను నియమించాలని కోరారు. మడకశిర నియోజక వర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు మడకశిర ఉపకాలువ వెడల్పు చేసేందుకు ప్రత్యేకంగా నిధులివ్వాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. గత ఐదేళ్లలో టీడీపీ నేతల, కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయించాల్సిన అవసరాన్ని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ సీఎస్ఆర్ ఫండ్‌ను జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు కేటాయించాలని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు.

న్యూస్ బాక్స్

నాణ్యతలో రాజీ వద్దు

● క్యూసీ ఈఈ మల్లికార్జునమూర్తి



సమీక్షిస్తున్న ఈఈ మల్లికార్జునమూర్తి

అనంతపురం సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడవద్దని క్వాలిటీ కంట్రోల్ విభాగం (క్యూసీ) ఈఈ మల్లికార్జునమూర్తి స్పష్టం చేశారు. స్థానిక తన చాంబర్‌లో సోమవారం ఆయన అనంతపురం-1, 2, పెనుకొండ, కదిరి క్యూసీ విభాగాల డీఈఈలు, జేఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల వారిగా రికార్డులు, పనులు తదతర అంశాలపై ఆరా తీసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తమ విధుల్లో బాధ్యతగా పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్యూసీ రిపోర్ట్‌లు అందించేలా చూడాలన్నా రు. కార్యక్రమంలో డీఈఈలు రవీంద్ర, లోకన్న, నాగశేఖర్, విశ్వనాథరెడ్డి, పలువురు జేఈలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల కోసం ఓ యాప్



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఆర్ఎం

గుంతకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం వచ్చేనెల నిర్వహించనున్న పోలింగ్‌లో రైల్వే ఉద్యోగుల ఓటు ఎక్కడుందో తెలిపే యాప్‌ను రైల్వే అధికారులు సోమవారం ఆవిష్కరించారు. రైల్వే డివిజన్‌లో పని చేస్తున్న రైల్వే ఉద్యోగులు తమ ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుసుకోవడానికి ఉపయోగపడే వేర్ ఈజ్ మై ఓట్ అనే యాప్‌ను ఏడీఆర్ఎం సుధాకర్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మిక సంఘ గుర్తింపు కోసం పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు వేర్ ఈజ్ మై ఓట్ యాప్‌లో తన పీఎఫ్ ఖాతా నంబరును నమోదుచేస్తే ఉద్యోగి పేరు, డిసిగ్నేషన్ వివరాలతో ఆ ఉద్యోగి ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుస్తుందని, ఆ వివరాలు చూపి ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, ఏపీఓ రంజిత్ కుమార్, సంపత్ పాల్గొన్నారు.

10న ఉచిత డీఎస్సీ కోచింగ్ స్ర్కీనింగ్ టెస్ట్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అందించే ఉచిత డీ ఎస్సీ శిక్షణకు సంబంధించిన స్ర్కీనింగ్ టెస్టును ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి పరీక్షకు హాజరుకావాలని కోరారు.

ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయం మార్పు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రఘువీరా కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయాన్ని మార్పు చేసినట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంప్యూటర్ సెంటర్, ఉర్దూ లైబ్రరీలను పాతూరులోని కేఎం సైపుల్లా కాంప్లెక్స్‌లోని 2వ ఫ్లోర్‌లోకి మార్చినట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

నేటి నుంచి ఎంపీడీఓలు, ఈఓఆర్డీలకు శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రెటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు నాలుగు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 5,6 తేదీల్లో ఉమ్మడి జిల్లా ఎంపీడీఓలకు, అనంతపురం జిలాల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు. 7,8 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని ఈఓఆర్డీలకు, శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ సెక్రెటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి: సీఎఫ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం సర్కిల్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోద బాయి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన ఆమె సర్కిల్ పరిధిలోని సిబ్బందితో సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకం కింద ఏఏ పనులు చేపడుతున్నారని సిబ్బందితో ఆరాతీశారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు.

రాక్రీట్‌కు ఉపాధి..!

● జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాక్రీట్ దోపిడీ
● 90 రోజుల ఉపాధి పథకం నిధులు స్వాహా
● నిర్మాణాలు చేయకనే సొమ్ము బదలాయింపు
● జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి
● గుట్టుగా వ్యవహారం చక్కబెట్టిన కొందరు అధికారులు

అనంతపురం సిటీ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ రూ.కోట్లను మింగేసింది. ప్రతి ఇంటికి ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పనిదినాలకు అందించే రూ. 30 వేలను కూడా డ్వామా ఏపీఓలు, హౌసింగ్ అధికారుల సహకారంతో గుట్టుగా కాజేసిందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం జరగకుండానే కొందరు అధికారులు రాక్రీట్ సంస్థకు బిల్లులు బదలాయించారనే ఆరోపణలు ఉన్నాయి. రాక్రీట్ సంస్థ దోపిడీలో తోపు సమీప బంధువైన ఓ ఏపీఓ కీలకంగా వ్యవహరించారని సమాచారం. జిల్లాలోని ఇతర ప్రాంతాలలో కూడా డ్వామా, హౌసింగ్ శాఖలకు చెందిన కొందరు అధికారులు ఆయా లబ్ధిదారులతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది.

● తోపు సమీప బంధువు ద్వారా అక్రమ వ్యవహారం

గతంలో వైసీపీ అధికారంలోకి రాగానే తోపు తమ సమీప బంధువైన ఓ ఏపీఓను తన నియోజకవర్గ పరిధిలోని మండలానికి తెచ్చుకున్నాడు. ఆ ఏపీఓ ద్వారా గుట్టుగా వ్యవహారం నడిపించి జగనన్న ఇళ్లకు సంబంధించి 90 రోజుల ఉపాధి పని దినాల నగదును రాక్రీట్ సంస్థకు తరలించేలా ప్రణాళిక రచించి అమలు జరిపారు. విషయం తెలిసినా ఆశాఖ పీడీ కూడా ఏమీ చేయలేని స్థితిలోకి ఆ ఏపీఓ, తోపు నెట్టేశారనే చర్చ అప్పట్లో సాగింది. నిధులను లబ్ధిదారుడి అకౌంట్‌కు బదలాయించడం, వెంటనే రాక్రీట్ సంస్థకు అందించేలా అధికారుల ద్వారా కథ నడిపించారని అప్పట్లో జోరుగా వినిపించింది. ఇన్ని అక్రమ వ్యవహారాలు నడిపారనే ఆరోపణలున్న ఆ ఏపీఓ ఇప్పటికి అక్కడే పనిచేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ హయాంలో రాక్రీట్‌కు అక్రమంగా నిధుల బదలాయింపులో ఆ ఏపీఓ కీలకంగా వ్యవహరించినా కూటమి ప్రభుత్వం ఇప్పటికి కొనసాగిస్తుండటం పట్ల ఆశాఖ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో జగనన్న ఇళ్ల పరిస్థితి ఇలా...

- రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల సంఖ్య: 7671
- గత ఐదేళ్లలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య: 350
- వివిధ దశలలో ఆగిపోయిన ఇళ్ల సంఖ్య: 7321
- రాష్ట్ర వ్యాప్తంగా రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల సంఖ్య: 50,385
- గత ఐదేళ్లలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య: 1500 మాత్రమే
  (ఈ పనులకే రూ. 350 కోట్లు బిల్లులు రాక్రీట్‌కు తరలించారని సమాచారం.)
- జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల సంఖ్య: 72,457
- పూర్తయిన ఇళ్ల సంఖ్య: 28,021
- ఇప్పటికీ నిర్మాణానికి నోచుకుని ఇళ్ల సంఖ్య: 8161
- సుమారు 70 శాతం ఇళ్లకు 90 రోజుల కింద బిల్లులు చేసి రూ. కోట్లలో బిల్లులను స్వాహా చేశారనే సమాచారం.

● జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లోనే కాకుండా జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే తరహా అవినీతి, అక్రమాలు జరిగినట్లు సమాచారం. 90 రోజుల ఉపాధి సొమ్మును ఓ రకంగా రాక్రీట్ సంస్థ స్వాహా చేస్తే మిగతా ప్రాంతాల్లో డ్వామాలోని కొందరు ఏపీఓలు, హౌసింగ్‌లోని కొందరు అధికారులు కలిసి దోపిడీ చేశారు. లబ్ధిదారుడితో కుమ్మక్కై కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలను ఏమాత్రం పరిశీలించకుండానే 90 రోజుల పనిదినాల అమౌంట్‌ను డ్రా చేసి వాటాలుగా పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల కనీసం పునాదులు తీయకుండానే 90 రోజుల పని దినాల అమౌంట్‌ను డ్రా చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడటం విమర్శలకు తావి



జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయం

స్తోంది. రాప్తాడు, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లో ఎక్కువగా అవినీతి అక్రమాలు జరిగినట్లు సమాచారం.

● ఏపీఓలదే కీలకపాత్ర

ఉపాధి పథకం కింద 90 రోజుల పనిదినాల నిధుల బదలాయింపు జరిగే ప్రక్రియలో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏపీఓల పాత్ర ఎక్కువగా ఉంటుంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొందరు ఏపీఓలకు సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం, ప్రజా ప్రతినిధుల బంధువులకు అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ వేయడం, కొందరు టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఏపీఓలగా పోస్టింగ్ ఇవ్వడంతో ఎక్కడికక్కడ అవినీతి అక్రమాలు పెరిగిపోయాయి. హౌసింగ్ ఉద్యోగుల్లోను కొందరు వారితో కలిసి అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి.

మా దృష్టికి రాలేదు



ఉపాధి పథకంలో 90 రోజుల పనిదినాల కింద అవినీతి జరిగిందనే విషయం మా దృష్టికి రాలేదు. ఏపీఓల ద్వారా బిల్లులు మంజూరు చేస్తాం. మా పరంగా తప్పు జరిగి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సమగ్ర నివేదిక కూడా ఆయా ప్రాంతాల ఏపీఓల వద్ద ఉంటుంది.

-శైలజ, పీడీ, జిల్లా గృహ నిర్మాణశాఖ

నేరం చేయాలంటే భయపడాలి

● మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోండి
● కరడుగట్టిన నేరగాళ్ల కదలికలపై దృష్టి పెట్టండి
● ఉమ్మడి జిల్లా పోలీసులతో హోంశాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి అనిత

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'మహిళలు, చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల కఠినంగా వ్యవహరించండి. వారు నేరం చేయాలంటే భయపడేలా పోలీసులు విధులు ఉండాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. అనంతపురం నగరంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది జరిగి నేరాలు, రోడ్డు ప్రమాదాలు, పోలీసుల చర్యలు, సేవల గురించి ఎస్పీలు జగదీష్, రత్న పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత నెలలో చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనపై పోలీసులు తీసుకున్న చర్యల గురించి హోం మంత్రి లోతుగా సమీక్షించారు. సమాజంలో యూనిఫామ్ ధరించే ఉద్యోగాలు చాలా ఉన్నా పోలీసు ఉద్యోగానికి ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. ఇందుకు అందరూ గర్వపడాలని అన్నారు. బాధ్యత కలిగిన శాఖలో ఉన్నామని, పోలీసులు ఉన్నారన్న నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా దైనందిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని అన్నారు. నక్సలిజాన్ని పూర్తిగా అణచిన చరిత్ర రాష్ట్ర పోలీస్



సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులు

శాఖకు ఉందని అన్నారు. ఇలాంటి పోలీసులకు చిన్న చిన్న ఘటనలతో మచ్చ రాకూడదని అన్నారు. ముందస్తు చర్యలతో నేరాలను నియంత్రించాలని సూచించారు. కరడుగట్టిన నేరస్థులు, రౌడీషీటర్లు, చెడునడత కలిగిన వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విధుల్లో నిర్లిప్తత వద్దని అన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర వహించే సీసీ కెమెరాలను అవసరమైనన్ని అందజేస్తామని, టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నియంత్రణ పక్కాగా జరగాలని అన్నారు. మెరుగైన సేవలు అందించిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు.

అలాంటి ఘటనలు జరగకూడదు..

చిలమత్తూరు గ్యాంగ్ రేప్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ ఐజీపీ శ్రీకాంత్ సూచించారు. పదే పదే నేరాలకు పాల్పడేవారిపై గట్టి నిఘా కొనసాగించాలని సూచించారు. తీవ్రమైన నేరాల్లో ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్, బేసిక్ పోలీసింగ్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయం, వినియోగించేవారి వరకు ఎవరినీ వదలకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, హోంశాఖ మంత్రి ఓఎస్డీ అనిల్ పులిపాటి, ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

నేడు డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మంగళవారం డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ జరగనుంది. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. హోం మంత్రి ఇప్పటికే అనంతపురం చేరుకున్నారు. అనంతపురం పీటీసీలో 2023 బ్యాచ్‌కు చెందిన 12 మంది డీఎస్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో ఏడుగురు మహిళా డీఎస్పీలు ఉండటం విశేషం. పాసింగ్ ఔట్ పరేడ్ మంగళవారం ఉదయం 9 గంటలకు మొదలౌతుంది.

అక్రమ డెప్యుటేషన్లపై ఆర్జేడీ విచారణ



విచారిస్తున్న కడప ప్రాంతీయ వైద్యాధికారి రామగిడ్డయ్య

అనంతపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అక్రమ డెప్యుటేషన్లపై అనేకమంది కొనసాగుతున్నారనే ఫిర్యాదులపై కడప ప్రాంతీయ వైద్యాధికారి(ఆర్జేడీ) రామగిడ్డయ్య విచారణ చేశారు. వైద్య శాఖ కమిషనర్ ఆదే శాల మేరకు ఆయన సోమవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి వచ్చారు. డీఎం హెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, ఏఓ గిరిజా మనోహర్‌ల ద్వారా జిల్లా కార్యాలయంలో ఎంతమంది డెప్యుటేషన్లపై ఉన్నారు? ఎక్కడ పనిచేస్తున్నారు? ఇక్కడ ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు? ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చారు? రికార్డులలో ఏమని నమోదు చేశారు? వారిహాజరు ఎలా పరిగణించారు? తదితర వివరాలను తెలుసుకున్నారు. అక్రమంగా ఎవరిని డెప్యుటేషన్లు వేసుకోలేదని, కార్యక్రమాల నిర్వహణ సమయంలో కొంతమందిని తాత్కాలికంగా నియమించుకొని పనిచేయించుకుంటు న్నట్లు డీఎంహెచ్ఓ, ఏఓలు వివరించారు. అనంతరం ఎన్జీఓ నాయకులు విచారణాధికారిని కలిసి పని సర్దుబాటుకు మాత్రమే కొందరిని నియమించుకున్నారని అక్రమ డెప్యుటేషన్లు లేవని వినతి పత్రం అందజేశారు. కాగా తాత్కాలిక ఆర్డర్లు పొందినవారు ఇక్కడ పనిలేకపోయినా కొందరు ఆఫీస్‌లో ఉంటూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు ఉండేవి. విచారణాధికారి వస్తున్నారనే సమాచారంతో వాళ్లంత తమ ప్లేస్‌కు వెళ్లి పోవడం గమనార్హం. ఇక్కడ సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని విచారణాధికారి రామగిడ్డయ్య మీడియాకు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి

యాడికి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాల కట్ట గ్రామంలో ప్రమాదవశాత్తూ మిద్దె పైనుంచి పడి యువకుడు మృతి చెందాడు. గ్రామంలో మల్లికార్జున, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు దేవరాజు(24) ఇంటివద్ద ఉంటూ సోదరులకు వ్యవసాయ ప నుల్లో సహాయం చేస్తుండేవాడు. ఆదివారం రాత్రి మిద్దెపైకి ఎక్కిన అతను కాలు జారి కరెంట్ తీగలపై పడ్డాడు. దీంతో షాక్‌కు గురై కిందపడి తీవ్రంగాగాయపడ్డాడు. గమనించినకు టుంబ సభ్యులు వెంటనే గుత్తి ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

తల్లిని వద్దన్న బిడ్డలపై కేసు

● సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద నమోదు ● సుమోటోగా స్వీకరించిన పోలీసులు

పత్తికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై తల్లిని కర్కశంగా వదిలేసిన బిడ్డలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా తల్లిని తీసుకెళ్లాలంటూ పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. రెండు పర్యాయాలు కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారిలో మార్పు రాలేదు. దీంతో గుంతకల్లులో ఉంటున్న కుమారుడు శ్రీనివాసులు, పత్తికొండ, బళ్లారిలో ఉంటున్న కుమార్తెలు శ్రీదేవి, సరస్వతిలపై సీనియర్ సిటిజన్స్ ప్రొటెక్షన్ యాక్ట్, సెక్షన్ 24 ప్రకారం సుమోటోగా కేసు నమోదు చేసినట్లు పత్తికొండ సీఐ జయన్న వెల్లడించారు. పత్తికొండ పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వెనుక కాలనీలో వృద్ధురాలు తిరుపతమ్మను కన్న కొడుకు శ్రీనివాసులు శనివారం రోడ్డుపై వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో కుమారుడు, కుమార్తెలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా వారు తల్లిని తమతో పాటు తీసుకెళ్లేందుకు నిరాకరించారు. అందుకే వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆర్డీవోకు సమాచారం ఇచ్చామన్నారు. కుమారుడు, కుమార్తెలను మంగళవారం ఆర్డీఓ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వృద్ధురాలు తిరుపతమ్మ కోలుకున్నాక అనాథ ఆశ్రమానికి తరలిస్తామని తెలిపారు.

నీళ్లకు నిధులివ్వాలి

● బడ్జెట్‌లో రూ.ఏడువేల కోట్లు కేటాయించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.ఏడువేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులు పూర్తి చేయడానికి దాదాపు రూ.500కోట్లు అవసరమని నిపుణులు అంచనా వేశారన్నారు. ఈ నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. తుంగభద్ర డ్యాంకు కొత్తగేట్లు ఏర్పాటు చేయడానికి దాదాపు రూ.2100కోట్లు ఖర్చవుతుందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి కొత్తగేట్ల నిర్మాణానికి మన వాటా నిధులు ఇవ్వాలని కోరారు. హంద్రీనీవా పంట కాలువల నిర్మాణానికి రూ.1200కోట్లు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు రూ.2వేలకోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఉంతకల్లు జలాశయ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధికి ప్రణాళిక

● డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికతో ముందుకు సాగాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య సూచించారు. డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. జీవనోపాధుల పెంపునకు ఓఎన్‌డీసీ కింద జిల్లాకు 1319 యూనిట్లు టార్గెట్ ఇచ్చారని, ఇప్పటి వరకు 400 యూనిట్లను గుర్తించామని తెలిపారు. మిగిలినవి నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు. ఉన్నతి కింద ఎస్టీ మహిళలకు 869 పెరటికోళ్ల పెంపకం యూనిట్లు కేటాయించారని, ఇప్పటి వరకు 763 యూనిట్లు గుర్తించామని తెలిపారు. రూ.6 వేల యూనిట్‌కు రూ.3,600 సబ్సిడీతో ట్రైకార్ నుంచి రూ.45.78 లక్షలు నిధులు కేటాయించారని తెలిపారు. ఉన్నతికింద ఎస్టీ మహిళలకు రూ.3 కోట్లు, ఎస్సీ మహిళలకు రూ.12 కోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్ శాతాన్ని పెంచాలని, అట్టడుగు సంఘాలను బలోపేతం చేయడానికి అన్ని విభాగాల్లో పురోగతి సాధించాలని సూచించారు. వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి, డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీఏ-వెలుగు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షలో డీపీఎంలు గంగాధర్, రవీంద్రబాబు, ఏపీఎంలు అనిత, మద్దిలేటి, మంజుళ, స్త్రీనిధి మేనేజర్ హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-19 రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు ఆదిత్యరెడ్డి, హన్సీస్టీఫెన్, మిస్బా, విశ్వనాథ్, సాయితరుణ్, అనన్య, అభిగ్న, భువనకృతి, సాహోఅఫ్రీన్‌లు ఈనెల 19 నుంచి కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. ఈ క్రీడాకారులను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ మలోల అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, చెస్ కోచ్ హుస్సేన్‌ఖాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టర్

బాల్‌బ్యాడ్మింటన్ విజేత ఆర్ట్స్ కళాశాల

● ముగిసిన ఇంటర్ కాలేజ్ మహిళల క్రీడా పోటీలు



బ్యాడ్మింటన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ జెస్సీ

గుంతకల్లుటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజ్ మహిళల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విజేతగా, కేఎస్ఎన్ అనంతపురం కళాశాల రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో శ్రీశంకరానంద గిరిస్వామి కళాశాల విన్నర్‌గా, అనంతపురం శ్రీవాణి కళాశాల రన్నర్‌గా నిలిచాయి. టెబుల్‌టెన్నిస్‌లో కదిరి ఎస్‌టీఎస్ఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురం శ్రీవాణి కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో శ్రీశంకరానందగిరిస్వామి కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్కేయూ రన్నర్‌గా నిలిచాయి. చెస్‌లో అనంతపురంలోని ఎస్‌వీడీఎస్ విన్నర్‌గా, అనంతపురంలో కేఎస్ఎన్‌జీడీసీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీలో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని కేఎస్ఎన్‌జీడీసీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్కేయూ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వీరికి ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ బీ జెస్సీ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కళాశాల పీడీ మహబుబ్ బాషా, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్



డీఎడ్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా డీఎడ్ పరీక్షలు

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎడ్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా సాగినట్లు విద్యాశాఖ ఏడీ-3 లాజర్ తెలిపారు. ఉదయం యువతులకు పరీక్ష నిర్వహించారు. 34 మందికిగాను ఒకరు గైర్హాజరయ్యారు. 33 మంది పరీక్ష రాశారన్నారు. మధ్యాహ్నం యువకులకు పరీక్ష నిర్వహించారు. 15 మందికిగాను 10 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరైనట్లు ఏడీ-3 తెలిపారు.

1.653 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.653 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ఇన్‌ఫ్లో 1042 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,059 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈనెల 18వతేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆ తరువాత అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 19 నుంచి 25వతేదీ మధ్య చెల్లిస్తే రూ.50, 26 నుంచి డిసెంబరు 3వ తేదీలోగా రూ.200, డిసెంబరు 4నుంచి 10వతేదీలోగా రూ.500 రుసుంతో కట్టాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. ప్రైవేటుగా రాసే విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30 తో అమ్ముడుపోయిన ట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.30 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30 వేలుతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.22 వేలుతో అమ్ముడు పోయాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 17 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అందజేశారు. వైద్యచికిత్స నిమిత్తం పట్టణానికి చెందిన శ్రావణికి రూ. 2.04 లక్షలు, ఎల్. ఉమా మహేశ్వర్‌కు రూ. 2 లక్షలు, ఎం లక్ష్మయ్యకు రూ. 20,524లు, జగన్నాథరెడ్డికి రూ. 2.96 లక్షలు, మహేంద్రకు రూ. 2లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే స్థానిక తన కార్యాలయంలో వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, వీరేశ్, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు గుత్తి విద్యార్థి

గుత్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే అథ్లెటిక్ పోటీలకు గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయికిరణ్ ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈనెల 2 అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14విభాగంలో సాయికిరణ్ ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈనెల 6నుంచి ఏలూరు జిల్లా ఉంగుటూరులో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు చెప్పారు. తర్వాత ఆ విద్యార్థిని అభినందించారు.



సాయికిరణ్‌తో ఉపాధ్యాయులు



శాంతినగర్, వివేకానంద క్వార్టర్స్‌లో దెబ్బతిన్న రహదారులు

అధ్వానం..!

రైల్వే పరిధిలో పాడైపోయిన రోడ్లు

డీఆర్ఎం కార్యాలయ రహదారి పరిస్థితీ అంతే..

తూతూ మంత్రంగా మరమ్మతులు



దెబ్బతిన్న డీఆర్ఎం ఆఫీసు అప్రోచ్ రోడ్డు

రైల్వే డివిజన్ కేంద్రం గుంతకల్లులో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. రైల్వే పరిధిలో ఉన్న దాదాపు అన్ని రోడ్లు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ రోడ్లను పలుమార్లు మరమ్మతు చేశారు. కాని పనులు చేసిన నెలల్లోనే అవి యథా స్థితికి చేరుతున్నాయి. ఆర్ఎస్ ప్రధాన రహదారిలో రెండు నెలల కిందట నిర్మించిన కొంత భాగం సిమెంటు రోడ్డు ధ్వంసమైపోయింది. ఆ రోడ్డును చూస్తే రైల్వే పనుల నాణ్యత ఎలా ఉందో ఊహించుకోవచ్చు. దక్షిణ మధ్య రైల్వే జీఎం ఎప్పుడు డివిజన్ కేంద్రం విజిట్‌కు వచ్చినా హుటాహుటిన లక్షలు పోసి మరమ్మతు పనులు చేస్తారు. అయితే అవి నెల రోజులు కూడా నిలవకపోవడం గమనార్హం.

- గుంతకల్లు, ఆంధ్రజ్యోతి

అన్ని రోడ్లూ అధ్వానమే

డివిజన్ కేంద్రంలోని డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే రహదారి, డీఆర్ఎం కార్యాలయంలోని రోడ్లు, రైల్వే స్టేషన్ రోడ్డు, రైల్వే ఆసుపత్రి రోడ్డు, డీజల్ షెడ్ రోడ్డు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ రోడ్డు, సెంట్రల్ స్కూల్, జీఆర్పీ కార్యాలయం రహదారి, శాంతినగర్ క్వార్టర్స్, వివేకానందనగర్ క్వార్టర్స్, డీఆర్ఎం కార్యాలయ అప్రోచ్ రోడ్డు, ఇలా దాదాపు అన్ని రోడ్లూ గుంతలమయమయ్యాయి. రైల్వే పరిధిలో ఉన్న 25 రోడ్లలో బాగున్నది ఒక్కటి కూడా కనిపించదు. ఎన్నికలకు ముందు దాదాపు రూ. 200 కోట్ల మేర నిధులు డివిజన్‌కు కేటాయించారు. కానీ డివిజన్ కేంద్రంలో ఒక్క రోడ్డును నిర్మించలేకపోయారు. పట్టణం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి తరచుగా దెబ్బతింటుండటంతో ఆటో డ్రైవర్లే మట్టిని తెచ్చి గుంతల్లో నింపి వాహనాలు వెళ్లడానికి అనువుగా మార్చుకున్న సందర్భాలున్నాయి. పట్టణంలో రోడ్లు బాగుండగా, రైల్వే పరిధిలోకి వస్తే ఒక్కసారిగా రోడ్ల రూపు మారిపోతుంది.

రెండు నెలల్లో ధ్వంసమైన రోడ్డు

రైల్వే పనులు ఎంత అధ్వానంగా ఉంటాయో తెలియాలంటే రైల్వే స్టేషన్ రోడ్డును చూస్తే అర్థమైపోతుంది. స్టేట్ బ్యాంకుకు ఎదురుగా ఆర్ఎస్ రోడ్డును ఎన్నిసార్లు మరమ్మతు చేసి ఉంటారో లెక్కలేదు. కానీ రిపేర్లు చేసిన నెలకే ఆ రహదారి యథాస్థితికి చేరుకుంటుంది. రోడ్డు దెబ్బతినడం, మరమ్మతు చేయడం, మరలా రోడ్డు గుంతల మయమైపోవడం, మరలా రిపేర్లు చేయడం ఇక్కడ నిత్యకృత్యం. దాదాపు రెండు నెలల కిందట రోడ్డు రిపేర్లలో భాగంగా 50 మీటర్ల మేర సిమెంటు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు కనీసం నెల రోజులు కూడా నిలవలేదు. ఇప్పుడు మరలా సిమెంటు లేచిపోయి, కంకర తొలగి గుంతలు ఏర్పడుతున్నాయి. రైల్వే ప్రాంతానికే అత్యంత ముఖ్యమైన కూడలిగా భావించే ఈ ప్రాంతంలో రోడ్డు అతుకుల బొంతను తలపిస్తూ ఉంటుంది. రైల్వే ఏరియాలో రోడ్లు సరిగా లేకపోవడం అనేది పక్కనపెడితే డీఆర్ఎం కార్యాలయం లోపల ఉన్న రోడ్డు పరిస్థితి వాటికి భిన్నంగా ఏమీ ఉండదు. జీఎం పర్యటన ఉన్నప్పుడల్లా లక్షలు వెచ్చించి రోడ్లు, డివైడర్లను రిపేరి చేస్తుండగా నెలలు కాదు కొన్ని వారాలలోపే ఆ మరమ్మతుల ఆనవాళ్లు కూడా కనిపించకుండా మరలా గుంతలు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డుతోపాటు రైల్వే కార్యాలయాలు, కాలనీల రహదారులను పునర్నిర్మించాలని రైల్వే కాలనీల ఉద్యోగులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి మాత

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు వేకువజామునే స్వామితో పాటు రాజరాజేశ్వరి అమ్మవారికి వివిధ అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయండి



అజయ్‌శర్మతో మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. బెంగళూరులోని నైరుతి రైల్వే నిర్మాణ విభాగ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అజయ్ శర్మను సోమవారం ఎమ్మెల్యే కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ.. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టిందన్నారు. రాయదుర్గం- తుంకూరు రైల్వే ట్రాక్‌పై రాయదుర్గం-అనంతపురం, రాయదుర్గం-కణేకల్లు మార్గాల మీద రెండు ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారన్నారు. కాగా రైల్వేశాఖ వీటిని సగం నిర్మించి వదిలేసిందని తెలిపారు. సగం పనులు పూర్తయి దిష్టిబొమ్మల్లా ఉన్న రెండు బ్రిడ్జిలను వెంటనే పూర్తిస్థాయిలో నిర్మించాలని కోరారు. దీనిపై చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సానుకూలంగా స్పందించారని కాలవ తెలిపారు.

'మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి'

గుంతకల్లుటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు కోరారు. విద్యార్థులతో కలిసి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన పథకాన్ని తొలగించిందన్నారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిందని, సీఎం చంద్రబాబు చొరవ చూపి మళ్లీ ఆ పథకాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు రమాదేవికి వినతి పత్రాన్ని అందజేశారు.

జిల్లాను అభివృద్ధి బాట పట్టిద్దాం..

- పరిశ్రమల ఏర్పాటుకు పుష్కల అవకాశాలు
- సమష్టిగా పనిచేద్దాం
- అధికారులు మారాలి.. పనిచేయాలి..
- భూముల ఫ్రీహోల్డ్‌లో భారీగా అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తప్పవ్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్



ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీ

పుట్టపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి అయిన అనగాని సత్యప్రసాద్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. మొదట కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయం, పాడిపంటలపై వివరించారు. ఇన్‌చార్జి మంత్రి అనగాని మాట్లాడుతూ.. జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు భూములు పుష్కలంగా ఉన్నాయన్నారు. పరిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో భూముల ఫ్రీహోల్డ్ ప్రక్రియలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల ఎకరాల భూములను ఫ్రీహోల్డ్ చేయగా.. జిల్లాలోనే 2.3 లక్షల ఎకరాలు చేశారన్నారు. ఇందులో 1.15 లక్షల ఎకరాలు నిబంధనలు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారని మంత్రి వెల్లడించారు. దీనిపై కమిటీ వేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు గత ప్రభుత్వం తరహాలోనే పనిచేస్తున్నట్లున్నారనీ, అలా కుదరదని మంత్రి స్పష్టం చేశారు. పనితీరు మారాలనీ, వేగం పెంచాలన్నారు. జిల్లా మార్పు అంశం ఎక్కడా ప్రస్తావనకు రాలేదన్నారు. పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోజుకో మంచి పనిచేసేలా పథకాలు



సంక్షేమం, అభివృద్ధి రెండు విభాగాల్లో సమంగా అభివృద్ధి చేయాలి. 150 రోజుల్లో రోజుకో మంచిపని చేసేలా పథకాలు అమలు చేశాం. జిల్లాలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం.

- సత్యకుమార్ యాదవ్, వైద్యశాఖ మంత్రి

ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయండి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు డబ్బు చెల్లించి, నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు అందలేదు. వారికి వెంటనే అందేలా చూడాలి. వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



నియోజయకవర్గంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే మొదలు పెట్టాలి. చెన్నేకొత్తపల్లి, నాగసముద్రం, పులేటిపల్లి వద్ద రైతులకు చెందిన 4 వేల ఎకరాల బీడు భూములు ఉన్నాయి. వాటిలో సోలార్ హబ్, హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలి. దాదలూరు పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పాలి. పేరూరు కాలువలకు భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం పరిహారం అందజేయాలి.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



2014 నుంచి 2019 వరకు ఆయాశాఖల్లో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు గత ప్రభుత్వం చెల్లించలేదు. వాటిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- బీకే పార్థసారథి, ఎంపీ

కరువు మండలాలుగా ప్రకటించాలి



నియోజకవర్గంలో ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి. నియోజకవర్గంలోని 195 చెరువులకు కృష్ణాజలాలను మళ్లించేందుకు చొరవ చూపాలి. సత్యసాయిబాబా జయంతి వేడుకలకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలి.

- పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

వరద బాధితులకు పింఛన్‌దారుల సాయం



పరిటాల శ్రీరామ్‌కు చెక్కు అందజేస్తున్న పింఛన్‌దారులు

ధర్మవరం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లికి చెందిన పింఛన్‌దారులు.. విజయవాడ వరద బాధితులకు రూ.1.15లక్షల సాయం చేశారు. ఆ మొత్తాన్ని సీఎం సహాయనిధికి ఇచ్చారు. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజయవాడ ప్రజల కోసం తమవంతుగా సాయం చేశామన్నారు. పింఛన్‌దారులకు పరిటాల శ్రీరామ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చేయి తడిపితేనే సంతకం పెడతా

చిరుద్యోగులపై హెచ్ఎం ప్రతాపం

వేతనాలు అందకుండా వేధింపులు

హిందూపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చేయి తడిపితేనే వేతనాల బిల్లులపై సంతకం చేస్తానంటూ ఓ ప్రధానోపాధ్యాయురాలు.. చిరుద్యోగులపై ప్రతాపం చూపారు. వేతనాలు అందకుండా వేధించారు. దీనిపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాల వాచ్‌మన్‌గా నజీర్, ఆయాగా అతడి భార్య షాహీనాను నియమించారు. వారికి ప్రతినెలా వేతనం డబ్బు ఖాతాలకు జమవుతుంది. మూడు నెలలుగా వేతనాల బిల్లులపై ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం సంతకం పెట్టట్లేదు. అడిగినా పట్టించుకోవడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన చెందుతున్నారు. రూ.2వేలు ఇస్తేనే సంతకం చేస్తానని తెగేసి చెబుతున్నారని వాపోయారు.

తిండికి లేక పస్తులుంటున్నాం

- షాహీనా, ఆయా

నిరుపేదలం. వేతనం అందక తిండికి కూడా లేక పస్తులుంటున్నాం. మూడు నెలలుగా జీతం బిల్లులపై సంతకం చేయకపోవడంతో అవి ముందుకు కదలలేదు. హెచ్ఎంను వేడుకుంటున్నాం. అయినా కనికరించడంలేదు. పాఠశాల హాల్‌లోకి కూడా రావద్దని హుకుం జారీ చేశారు.

దురుసుగా మాట్లాడుతోంది

ఆయా షాహీనా దురుసుగా మాట్లాడుతోంది. హెచ్ఎం అనే మర్యాద కూడా ఇవ్వట్లేదు. అయినా గత నెలలో వేతనాల బిల్లులు ఆమెకు తెలియకుండా ఆన్‌లైన్ చేశా. పేపర్లతో పనిలేదు. ఈనెల బిల్లులు మాత్రమే పెట్టాలి. ఆ సంతకం కూడా మంగళవారం పాఠశాల వద్దకు వస్తే పెట్టి పంపుతానని చెప్పా.

- సామ్రాజ్యం, హెచ్ఎం

బాలికకు వేధింపులు.. పోక్సో కేసు నమోదు

పెనుకొండ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలికపై వేధింపులకు పాల్పడిన ఎరుకల విజయ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు కియ స్టేషన్ ఎస్ఐ రాజేష్ సోమవారం తెలిపారు. ఎరుకల విజయ్.. బాలిక వెంట పడుతూ, ఫొటోలు తీస్తూ వేధిస్తుండేవాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కదిరి బాలికలు.. మనుబోలులో ప్రత్యక్షం

బాలసదన్‌కు తరలించిన అధికారులు

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై అలిగి వచ్చేసిన ఇద్దరు బాలికలకు నెల్లూరు జిల్లా మనుబోలు తిరుగుతుండగా ఆదివారం రాత్రి స్థానికులు గుర్తించారు. ఆరిని ఎస్ఐ రాకేష్ నెల్లూరులోని బాలసదన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో తల్లిదండ్రుల వేధింపులు తాళలేక, వారి ఆలనాపాలనా లేకపోవడంతో ఇంట్లో నుంచి శుక్రవారం పారిపోయి వచ్చేశారు. గూడూరు వెళుతున్న రైలు ఎక్కి మనుబోలు వద్ద దిగారు. రాత్రి పది గంటల సమయంలో మనుబోలులో దసరా చావడి వద్ద తిరుగుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ స్పందించి బాలికల నుంచి సమాచారం సేకరించారు. రోదిస్తున్న వారికి భోజనం పెట్టించి నెల్లూరులోని బాలసదన్‌కు తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు రాగానే బాలికలను అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

నల్లమాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బావణ కుంట ఎస్సీ కాలనీకి చెందిన పులేటి చిరంజీవి (36) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడు తున్న అతను పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. చిరంజీవికి భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారు డు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

నంబులపూలకుంట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి (34) గుండెపోటులో సోమవారం మృతిచెందారు ఇటీవల బదిలీలో భాగంగా బలిజపల్లికి బదిలీపై వచ్చారు. ఇతను గతంలో కొండమనాయునిపాళ్యం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసేవాడు. ఇతను అవివాహితడు. ఇతను కదిరి పట్టణంలో నివాసముండేవారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఓ కారు అదుపు తప్పి.. రోడ్డు పక్కన పొలంలోని కాలువలోకి దూసుకెళ్లింది. ధర్మవరం నుంచి ఇద్దరు యువకులు కారులో అనంతపురం వెళ్తుండగా.. వేగంగా వెళ్తున్న ఆ కారు అదుపు తప్పి.. పంట పొలాలోని కాలువలోకి దూసుకెళ్లింది. గమనించిన చుట్టు పక్కన పొలాల్లోని రైతులు, కూలీలు ఆ కారును తాడుతో మరో వాహనానికి కట్టి బయటకు సురక్షి తంగా లాగారు. కారులో ఉన్న యువకులకు ఎటువంటి గాయాలూ కాలేదు.

అన్నింటిని కరువు మండలాలుగా ప్రకటించాలి

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మూడు మండలాలను మాత్రమే కరువు మండలాల జాబితాలో చేర్చారని, కానీ నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నాయని, అన్నింటినీ కరువు మండలాలు ప్రకటించాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ కోరారు. ఈ మేరకు పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ఎన్డీఏ ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను విజ్ఞప్తి చేశారు. గతనెల 21న కురిసిన భారీ వర్షాలకు రైతులు, చేనేతలు సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వారికి పరిహారం అందేలా చూడాలని విన్నవించారు. హౌసింగ్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన తుంపర్తి రైతులకు న్యాయం చేయాలని, ముదిగుబ్బ మండలంలోని జిల్లేడుబండ్ల రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సాయి సేవలో మంత్రి అనగాని



పుట్టపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యసాయి మహాసమాధిని సోమవారం దర్శించుకున్నారు. మంత్రి వెంట రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారధి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప ఉన్నారు.

అధికారులే రేషన్ పంపిణీ చేయాలి

ముదిగుబ్బ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.బండ్లపల్లిలో రెవెన్యూ అధికారులే రేషన్ పంపిణీ చేయాలని గ్రామస్థులు.. తహసీల్దార్ నారాయణస్వామికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్.బండ్లపల్లిలో చౌకధాన్యపు డీపో మంజూరు విషయంలో జాప్యం జరుగుతోందని, మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఎవరిని రేషన్ డీలర్‌గా నియమిస్తారో అప్పటి వరకు అధికారులే రేషన్ పంపిణీ చేయాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ధర్మవరం: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, అశోక్, సాయిప్రసాద్, చిరంజీవి, నిఖిల్‌ఎంపికయ్యారు. అనంతపురంలో గత నెలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్-14,17,19 విభాగాల్లో వీరు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో అన్నమయ్య జిల్లా అంగల్లులో ఈ నెల 6,7 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మనోజ్, అశోక్, అండర్-17 విభాగంలో రాజమండ్రిలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే పోటీల్లో సాయిప్రసాద్, అండర్-19 విభాగంలో ఏలూరు జిల్లా పెద్దవేలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో చిరంజీవి, నిఖిల్ పాల్గొంటున్నారు.



జలహారతి ఇస్తున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి

పోతుకుంట చెరువు వద్ద జలహారతి

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట చెరువు వద్ద నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సోమవారం గంగపూజ చేసి జలహారతి ఇచ్చారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పూడి పోయిన కాల్వలకు మళ్లీ జీవం పోస్తామన్నారు. అనంతరం పోతుకుంట గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, మాజీ ఎంపీపీ మద్దిలేటి, కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, విజయసారధి, తలారి వెంకటలక్ష్మి, పోతలయ్య, రవి, రమేశ్, చిత్రా రామ్మోహన్, ఐటీడీపీ రాము పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మెమో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బత్తలపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ సచివాలయ ఉద్యోగికి ఉన్నతాధికారులు సోమవా రం మెమో జారీ చేశారు. బత్తలపల్లిలోని విజయ్‌చౌదరి కాలనీలో 85 ఏళ్ల వృద్ధురాలు రామలక్ష్మి నివాసముంటోంది. ఒకటో తేదీన ఆమెకు పింఛన్ ఇచ్చేందుకు ఎవరూ రాకపోవడంతో ఆమె కుటుంబీకుడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేశారు. దీంతో ఆ ఉద్యోగి.. 'అందరికీ ఇళ్లవద్దకే వచ్చి పింఛన్ ఇవ్వాలంటే ఎలాగనీ, సచివాలయం వద్దకే వచ్చి తీసుకోండ'ని చిందులు తొక్కాడు. అయితే ఆ వెల్ఫేర్ అసిస్టెంట్ ఫోన్ మండిపడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఆంధ్రజ్యోతి కథనాన్ని సోమవారం ప్రచురిం చింది. స్పందించిన ఉన్నతాధికారులు ఆ ఉద్యోగికి మెమో జారీ చేశా రు. అతను ఇచ్చే సమాధానాన్ని కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఓబుళదేవరచెరువు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ శాఖ ఏడీ సత్యనారాయణ, డీఆర్‌సీ వ్యవసాయ సహాయ సంచాలకుడు సనావుల్లా సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో ఓడీసీ, అమడగూరు వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఓ వెంకటరమణాచారి, ఏఈఓ వెంకటేష్ పాల్గొన్నారు.







మినీగోకులం షెడ్ నిర్మాణానికి భూమిపూజ

ధర్మవరం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్లలో పాడిరైతు నారాయణస్వామికి ప్రభుత్వం మినీగోకులం షెడ్డు మంజూరు చేసింది. షెడ్డు నిర్మాణానికి టీడీపీ సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఇందులో ఎంపీడీఓ సాయిమనోహర్, మండల పశువైద్యాధికారి శేఖర్, ఉపాధిహామీ ఏపీఓ అనిల్ కుమార్, టీడీపీ నాయకులు పార్థారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాఘవరెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, చంద్రాయుడు, శీల్లాఆనంద్, అశోక్, పంచాయతీ సెక్రటరీ రెడ్డమ్మ, సచివాలయ సిబ్బంది, ఉపాధిహామి టెక్నికల్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆలయాల్లో చోరీ

ధర్మవరంరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్లూరు గ్రామంలో మహంకాళమ్మ, పెద్దమ్మ అమ్మవారి ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఆలయాలు పక్కన పక్కనే ఉన్నాయి. ఆలయ పూజారి కాటమయ్య సోమవారం ఉదయం ఆలయాలను శుభ్రం చేసేందుకు వెళ్లగా అక్కడ ఆలయాల తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా.. దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు ఆ ఆలయాలను పరిశీలించారు. ఆలయాల్లోని నాలుగు సీసీ కెమెరాలు దుండగులు ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. మహంకాళమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల మంగళసూత్రాలతో పాటు.. హుండీల్లో రూ.80 వేలు చోరీ అయినట్లు గుర్తించారు. పోలీసులు పుట్టపర్తి నుంచి క్లూస్ టీం రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సోమందేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తాము సాగుచేసుకుంటున్న పొలాలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ధర్నా చేపట్టారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో తుంగోడు, వెలిదడకల, చిన్నబాబయ్యపల్లి, కూకటిమానుపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ తుంగోడు పంచాయతీలోని సర్వేనంబరు 28లో గత 40 సంవత్సరాలుగా సుమారు 200 మంది రైతులు భూములు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. అనేకసార్లు పట్టాలు ఇవ్వాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని దీంతో రైతులతో కలిసి ధర్నా చేపట్టామన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గోరంట్ల/పెనుకొండ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి చెందిన నాయకుల కుటుంబాలకు ఆ పార్టీ నేతలు పలుచోట్ల పరామర్శించారు. గోరంట్ల మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ (63) మృతిచెందడంతో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప సోమవారం నివాళులర్పించారు. కమ్మవారిపల్లి మాజీ సర్పంచ్ పట్టాభిరామయ్య సోదరుడు లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు నిమ్మల చంద్రశేఖర్, నాగరాజు, రామమోహన్ తదితరులున్నారు. పెనుకొండ మండలంలోని కోనాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు డీసీ వెంకటేశులు కుటుంబాన్ని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు సోమవారం పరామర్శించారు. కోనాపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు డీసీ వెంకటేశులు కుమారుడు మహేష్ కొత్తచెరువు మండలం బండ్లపలి వద్ద వంగపేరు నదిలో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారాయణస్వామి, జీవీపీ నాయుడు పాల్గొన్నారు. పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు సిద్దప్ప ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్ పటేల్, తనయుడు సాయికళ్యాణ్ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విజయవాడలో ధర్నాకు తరలిన రైతులు



రైల్వే స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

గోరంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడానికి జిల్లా కార్మిక సంఘం ఆధ్వర్యంలో గోరంట్ల, సోమందేపల్లి మండలాలకు చెందిన భూనిర్వాసిత రైతులు సోమవారం తరలి వెళ్లారు. గోరంట్ల మండలంలోని బెల్, నాసిన్ కంపెనీల ఏర్పాటు కోసం భూములిచ్చిన పాలసముద్ర, చిన్నబాబాయ్యపల్లి, కావేటినాగేపల్లికి చెందిన రైతులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. 2013 భూసేకరణ ప్రకారం పునరావాసం కల్పించాలని గత మూడేళ్లుగా నిరసన పోరాటం చేస్తున్నారు. అధికారుల నుంచి సరైన స్పందన, న్యాయం జరగకపోవడంతో ధర్నా కోసం విజయవాడ తరలి వెళ్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు సాకే వెంకటేష్, స్వర్ణలత, నారాయణ, క్రిష్ణమూర్తి, వెంకటేష్‌లు, భూనిర్వాసితులు ఉన్నారు.

అతిగా మద్యం సేవించి కర్ణాటక వాసి మృతి

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి కర్ణాటక వాసి మృతి చెందాడు. ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం గుడిబండకు చెందిన రమేష్ (45) తన స్నేహితులతో కలిసి వీరాపురం పరిసర ప్రాంతానికి ఆదివారం సాయంత్రం వచ్చి అతిగా మద్యం సేవించాడు. లిక్కర్‌తో పాటు కల్లు కూడా అతిగా సేవించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్నేహితులు అతడిని ఇంటికి తీసుకుపోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. రాత్రి ప్రాణాలు వదిలాడు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు సమాచారం అందించారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

అమరాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో ఆదివారం రాత్రి చైత్ర(24) అనే వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొందని ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. గత సంవత్సరం నుంచి వేరే కాపురం పెట్టుకొందామని భర్త వద్ద అనేకసార్లు ప్రస్తావన చేసినా పట్టించుకోకపోవడంతో చైత్ర మానసికంగా విరక్తి చెంది ఇంటిలోనే దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొందని అన్నారు. భర్త కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

పెనుకొండ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) :మండలంలోని గుట్టూరు సమీపంలో కొండల్లో వెలసిన శ్రీ కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలకు వెళ్తే కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి ఆలయంలోకి చొరబడి హుండీ ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారని ఆలయ నిర్వాహకులు కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి ఆలయాన్ని పరిశీలించి చోరీపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గుడిబండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కల్యాణచక్రవర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరా పదవీ విరమణ పొందారు. దీంతో పోస్టు ఖాళీ పడింది. పెనుకొండలో పనిచేస్తున్న కల్యాణచక్రవర్తిని నియమించారు.

రొళ్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామారావు

రొళ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమరాపురం మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయనను రొళ్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌లో సబ్జెక్టుల వారీగా బోధించేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారి గంగాధర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీకే, కరెంట్ అఫైర్స్ చైల్డ్ డెవలప్‌మెంట్, హిస్టరీ, సైన్స్, సోషల్ మెథడాలజీ, మ్యాథ్స్ సబ్జెక్టుల వారిగా తమ బయోడేటాలను అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి

● నామినేటెడ్ పదవుల్లో సమన్యాయం ● జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్



మంత్రులు సత్యప్రసాద్, సవితను కల్లుకుండలతో సన్మానిస్తున్న గీత కార్మికులు

పెనుకొండ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి నేతలను సమన్వయం చేసుకుని అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మొదటిసారి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వచ్చిన అనగాని సత్యప్రసాద్‌కు సోమవారం పెనుకొండలో బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత గజమాలతో స్వాగతం పలికారు. ఆమె ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేసిన ఫ్రీహోల్డ్‌లో 20.30 లక్షల ఎకరాలకు ఫ్రీహోల్డ్ చేయగా అందులో 50 శాతం తప్పుల తడకగా ఉన్నాయన్నారు. గతంలో రాజధానుల విషయంలో మూడు ముక్కలాట ఆడి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. యువతకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో అనంతపురం, సత్యసాయి జిల్లాలు అగ్రస్థానంలో ఉంటాయన్నారు. అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న ఇబ్బందులను సమన్వయం చేస్తామన్నారు. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల్లో కూటమి నాయకులను సమన్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌కు మంత్రి హామీ: ఎమ్మెల్యే



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

మడకశిరటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మడకశిరను రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. సోమవారం సత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి కొడికొండ చెక్‌పోస్టు వద్ద మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు మడకశిర రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిరలో పర్యటించిన సందర్భంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని మంత్రికి వివరించారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకొంటామని మంత్రి తెలిపినట్లు వివరించారు. రైతుల ఇబ్బందులు తొలుగుతాయని, భూ సమస్యల పరిష్కారానికి ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదన్నారు. ఈ సందర్భంగా మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలలో కార్తీక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లేపాక్షి దుర్గాదేవి, మడకశిరలో చంద్రమౌళేశ్వరస్వామి, గంగాధరేశ్వర స్వాములకు ప్రత్యేక అలంకరణ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మహిళలు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహిళలు ఆలయంలో శివలింగాలకు పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. మడకశిర పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక మాసపూజలు నిర్వహించారు. మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో వెలసిన గంగాధరేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఆలంకణచేసి పూజలు నిర్వహిచారు. అగళి మండలంలోని మధుడి వీరభద్రేశ్వరస్వామి, కొరమేపల్లి బీరలింగేశ్వరస్వామి, శంకరేశ్వరస్వామి, నరసాంబుది లక్ష్మీ రంగనాథస్వామి, ఇతనగలూరు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రహదారులకు మరమ్మతులు

- రూ.1.90 కోట్లు మంజూరు

- పలుచోట్ల పనులు ప్రారంభం



మడకశిర పట్టణంలో రోడ్లకు మర్మతులు చేస్తున్న దృశ్యం

మడకశిర, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రహదారులు ఎక్కడ చూసినా గుంతలమయంగా మారాయి. గత ఐదేళ్లుగా మర్మతులకు నోచుకోక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. నియోజకరవర్గంలో 30 కిలో మీటర్ల మేర రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో వర్షానికి దెబ్బతిన్న రోడ్ల మర్మతులను ప్రారంభించారు. మడకశిర-భక్తరపల్లి రోడ్డు, బుళ్లసముద్రం-వెంకటమ్మపల్లి, పరిగి-యు.రంగాపురం, గోవిందాపురం-కేకాతి, గుండుమల-ఎస్.రాయాపురం, గంగళవాయిపాళ్యం రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. మంజూరయిన నిధులతో మరమ్మతులు చేపట్టామని ఆర్‌అండ్‌బీ ఏఈఈ నరసింహమూర్తి తెలిపారు. రోడ్లకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించేందుకు రూ.30 లక్షలు, మరికొన్ని చోట్ల దెబ్బతిన్న రోడ్ల మర్మతులకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

మూగ జీవాల రోదన

● వ్యాధులతో విలవిల
● రైతుల గోడు పట్టని పశు వైద్యాధికారులు



వ్యాధి సోకిన ఆవును తీసుకొస్తున్న రైతు, ముద్ద చర్మవ్యాధితో వచ్చిన బొబ్బలు

మడకశిర రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మూగ జీవాలు పలు రకాల వ్యాధులతో విలవిలలాడుతున్నా పశు వైద్యాధికారులు ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. తమకు జీవనాధారమైన పశువులు వ్యాధుల బారిన పడుతుంఏ పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. పశు వైద్యాధికారుల లెక్కల ప్రకారం మండలంలో 35 వేల పాడి ఆవులు, గేదెలు, రెండు లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. మడకశిర క్లస్టరులో 11 పశు వైద్యశాలలు ఉన్నాయి. నీలంతాపురం పశువైద్యశాలలకు మాత్రమే పశు వైద్యాధికారి ఉన్నారు. ప్రస్తుతం పాడి ఆవులకు ముద్ద చర్మవ్యాధులు సోకుతున్నాయి. దీంతో పాడి ఆవులు మేత మేయకపోవడంతో పాలు దిగుబడి తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో దూడలకు వింతవ్యాధులు సోకి మృత్యువాతన పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువైద్యులు అందుబాటులో లేరు

- లక్ష్మయ్య, పాడి రైతు, నీలకంఠాపురం

పాడి పశువులకు ముద్ద చర్మవ్యాధులు సోకుతున్నాయి. దీంతో మేత మేయడంలేదు, పాలు ఇవ్వడంలేదు. పశువైద్యశాలలో డాక్టరు ఉన్నా రైతులకు అందుబాటులో ఉండడంలేదు. పశువైద్యశాలలో మందులు లేకపోవడంతో రూ.2 వేలు ఖర్చుచేసి ప్రైవేట్ మందుల షాపులో కొనుగోలు చేశాను. పశువులతో పాటు ఆ మందులు తీసుకెళ్లి పశువైద్యశాలలో ఇస్తే చికిత్సలు అందించారు. పశువైద్యశాలలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అధికారుల నిర్లక్ష్యంతో మృత్యువాత

- రాజగోపాల్, పాడిరైతు, డి.రాయాపురం

మా గ్రామంలో వారంలో వింత వ్యాధులతో ఒక పాడి ఆవు, దూడ మృత్యువాతన పడ్డాయి. ఆవులకు వింత వ్యాధులు సోకుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళితే పట్టించుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఆవు, దూడ మృతి చెందాయి. అ నష్టం ఆ శాఖ అధికారులే చెల్లించాలి. పాడి పశువులకు వ్యాధులు వస్తే పశువైద్యశాలలో మందులు లేకపోవడంతో కర్ణాటకకు వెళ్లి తీసుకోస్తున్నాం.

వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకుంటాం

- అమర్, ఏడీ, పశువైద్యశాఖ, మడకశిర

పాడి పశువుల్లో ముద్ద చర్మవ్యాధులు సోకకుండా చర్యలు తీసుకుంటాం. కర్ణాటక నుంచి కొనుగోలు చేసిన పాడి పశువులకు ముద్ద చర్మ వ్యాధులు వస్తుంటాయి. ఈ వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. వ్యాధి సోకిన పశువులను మిగిలిన వాటికి దూరంగా ఉంచాలి.

పరిగి చెరువుకు గంగపూజ



గంగపూజ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

పరిగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : కొన్నిరోజులుగా ఎగువ కర్ణాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు వచ్చి పరిగి చెరువు నిండింది. మరువపారుతున్న సందర్భంగా సోమవారం అధికారులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున గంగపూజ నిర్వహించారు. 32 ఏళ్ల తరువాత మరువ పారుతుండడంతో పరిగిచెరువు ఆయకట్టు కింద 2,854 ఎకరాల పంట సాగు చేస్తున్నారు. వచ్చే ఏడాది కూడా బోరుబావుల్లో నీటిమట్టం పెరిగి పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ లక్ష్మీ శివశంకర్ పూజ నిర్వహించడానికి అవకాశం కల్పించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎస్ఐ రంగడు యాదవ్, ఎంపీడీఓ శ్రీధర్, నాయకులు గోవిందరెడ్డి, పరిగి వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కమిటీల ఎన్నిక

మడకశిరటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) 3వ స్వర్ణోత్సవాన్ని సోమవారం పట్టణంలోని కేపీ పాఠశాల నందు ఘనంగా నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న మాట్లాడుతూ యూటీఎఫ్ సమసమాజ నిర్మాణానికి, విద్యాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. మడకశిర మండల కమిటీ అధ్యక్షుడిగా మహలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షుడిగా టి.మూడ్లగిరియప్ప, ప్రధాన కార్యదర్శిగా డి.నరసింహప్ప, రొళ్ల మండల అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కేశవప్రసాద్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ర్యాలీగా వెళుతున్న వాల్మీకులు

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన వీధి గుండా చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి అడుగు జాడలో ప్రతి ఒక్కరు నడచుకోవాలన్నారు. ఆయన చూపించిన మార్గం అత్యంత పవిత్రమైనదని అన్నారు.

అగళి సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

అగళి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో సోమవారం మంత్రిని కలిశారు. మొదట శాలువ కప్పి పూలమాలలువేసి సన్మానించారు. అనంతరం సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మడకశిర ప్రాంతం చాలా వెనుకబడినదని అభివృద్ధికి సహకరించాలని కోరారు. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మకు పలు సమస్యలను వివరించారు.

వీఆర్ఏలకు కనీస వేతనం ఇవ్వాలి



డీటీకి వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ సహాయకులకు కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ హనుమంతుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైట్‌డ్యూటీలు, ఇసుక, రైస్‌మిల్ డ్యూటీలు రద్దు చేయాలని, నామినీలను వీఆర్ఏగా గుర్తించాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. తెలంగాణ తరహాలో మన రాష్ట్రంలో కూడా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబావలి, అంజనప్ప, చెన్నకేశవులు గోవిందప్ప సుశీల తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్‌పై కేసు నమోదు

పెనుకొండ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె కనబడటం లేదని ధర్మవరానికి చెందిన సూర్యనారాయణ ఆదివారం కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. అమ్మాయి శ్రీమున్య మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతోందన్నారు. ఆదివారం ఉదయం గుట్టూరులోని మావయ్య ఇంటిక వెళ్తానని ధర్మవరం నుంచి బయలుదేరిందన్నారు. సాయంత్రమైనా గుట్టూరుకు రాకపోయేసరికి చుట్టుపక్కల గాలించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు చేపల చెరువు వేలం

గుడిబండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుడిబండ పంచాయతీ కార్యాలయంలో చేపల చెరువును వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనేవారు పంచాయతీలో ఎలాంటి బాకీలు ఉండరాదన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచు కరుణాకర్‌గౌడ్, ఈఓఆర్‌డీ నాగరాజునాయక్ హాజరవుతారన్నారు. వేలం పాటదారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పంచాయతీ కార్యదర్శి కోరారు.